# ఆరు గ్యారెంటీలకు భారీగా దరఖాస్తులు

- అభయహస్తం దరఖాస్తులు 56 వేలు
- ఇతర దరఖాస్తులు 18, 528
- నేటి నుంచి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ


రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని(ఫైల్)

బేగంపేట్, జనవరి 7: అర్హులైన లబ్ధిదారుల నుంచి వచ్చిన ఆరు గ్యారెంటీల్లో పలు పథకాలకు దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగిసింది. గత నెల 28న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ జనవరి 6తో ముగిసింది. ఆయా పథకాలను పొందేందుకు అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో ఆరు డివిజన్‌లలో మొత్తం 24 సెంటర్‌లను ఏర్పాటు చేసి 96 కౌంటర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. ఈక్రమంలో నియోజకవర్గం మొత్తంగా అభయహస్తం ద్వారా 56 వేల 3 దరఖాస్తులు రాగా, ఇతర వాటికి 18, 528 దరఖాస్తులు వచ్చినట్లు బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య తెలిపారు. స్వీకరించిన దరఖాస్తులను సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను ప్రారంభించనున్నట్టు వారు తెలిపారు. ప్రధానంగా సనత్‌నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్లు మహేశ్వరి, హేమలత, కొలన్ లక్ష్మి, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, అరుణగౌడ్, ఆకుల రూపలు దరఖాస్తులు నింపడంలో దగ్గరుండి చూసుకున్నారు. ఇదిలా ఉండగా, నియోజకవర్గంలోని బన్సీలాల్‌పేట్ డివిజన్ నుంచి అధికంగా లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోగా, అత్యల్పంగా అమీర్‌పేట్ డివిజన్ నుంచి దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

**డివిజన్ల వారీగా వచ్చిన దరఖాస్తులు**

| డివిజన్ | అభయహస్తం | ఇతరాలు |
|---|---|---|
| బేగంపేట్ | 10,233 | 3,397 |
| రాంగోపాల్‌పేట్ | 8096 | 2,870 |
| బన్సీలాల్‌పేట్ | 13,923 | 4,479 |
| అమీర్‌పేట్ | 5,944 | 1,653 |
| సనత్‌నగర్ | 9,379 | 2,863 |
| మోండామార్కెట్ | 8,428 | 3,266 |

## ముగ్గులను తిలకించిన ఎమ్మెల్యే

సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని బీదల బస్తీ గ్రౌండ్‌లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్లు హేమ, శైలజ పాల్గొని ముగ్గులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన తరువాతే పండుగలకు ప్రాధాన్యత పెరిగిందని అన్నారు. ఆయా పండుగల సందర్భంగా పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకు రాంచందర్, బెజ్జంకి రాజేశ్, అజీజ్, రవీందర్‌సాగర్ పాల్గొన్నారు.
- సికింద్రాబాద్, జనవరి 7

## కష్టానికి ప్రతిఫలమే..ఈ అవార్డు

**డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి**

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 7: పారిశుద్ధ్య కార్మికుల కష్టానికి ప్రతిఫలమే జీహెచ్‌ఎంసీకి జాతీయ అవార్డు అని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో జీహెచ్‌ఎంసీ ప్రతి ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు గెలుచుకుంటుందని గుర్తు చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో జాతీయ అవార్డుకు హైదరాబాద్ ఎంపికవడం గర్వకారణమన్నారు. జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## లక్ష్మీచరణకు డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 7: ఆంధ్రా విశ్వవిద్యాలయం లా విభాగంలో జె. లక్ష్మీచరణ డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ సీతా మాణిక్యం పర్యవేక్షణలో 'ఎ స్టడీ ఆన్ ఎఫెక్టివ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ రేప్ లాస్ ఇన్ ఇండియా విత్ రిఫరెన్స్ టు మెడికల్ అండ్ ఫోరెన్సిక్ యాస్పెక్ట్స్ – ఇష్యూస్ అండ్ చాలెంజెస్'అనే పరిశోధన పూర్తి చేసి సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఆంధ్రా యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆమెకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

# సమాజంలో మార్పులు గమనించాలి

అమీర్‌పేట్, జనవరి 7 : సమాజం అనేక విధాలుగా మారుతుండడం చూస్తున్నామని సమాచార శాఖ మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కొన్నేండ్ల క్రితం వ్యవసాయం ఆధారంగా ఉన్నా.. క్రమంగా పారిశ్రామికంగా ఆ తర్వాత ఇప్పుడు పరిజ్ఞానంతో కూడిన సమాజం దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. విద్యార్థులు అనునిత్యం ఈ మార్పులను గమనిస్తూ మరింత మెరుగైన పరిజ్ఞానాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఆదివారం అమీర్‌పేట్‌లోని మౌంట్ బన్యాన్ స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వేడుకల్లో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అంతేకాకుండా కేవలం మార్కులే ప్రామాణికం కాకుండా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మౌంట్ బన్యాన్ స్కూల్ చైర్మన్ ఎం.ఎ.కరీం, డైరెక్టర్లు అనీస్ ఫాతిమా, వి.కేశవన్, స్కూల్ ప్రతినిధులు వెంకటేశన్, ప్రిన్సిపాల్ దీప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సమాచార శాఖ మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం, పెప్సీ నాయకులు

## జౌళి పరిశ్రమ ఏర్పాటులో భాగస్వామ్యం కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 7 : పెరిక ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ సొసైటీ (పెప్సీ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆవిష్కరించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కోదండరాం మాట్లాడుతూ .. పెప్సీ ఒక సంఘంగా ఏర్పడి తమ హక్కులను సాధించుకునే దిశగా కృషి చేస్తున్నందుకు అభినందించారు. పెప్సీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ.. జనుము పండించి, దానితో ధాన్యం రవాణా బోరెలు, గోనె పట్టాలు, ధాన్యం సంచుల తయారీ చేసిన కుల వృత్తి అంతరించి పోయినందున జౌళి పరిశ్రమ ఏర్పాటులో భాగస్వామ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పెప్సీ ప్రధాన కార్యదర్శి తిప్పని సిద్ధులు, రాష్ట్ర సలహాదారు చింతం లక్ష్మీనారాయణ, కోశాధికారి సతీశ్‌కుమార్, జిల్లాల అధ్యక్షులు రాధాకృష్ణ, వెంకటయ్య, డాక్టర్ బండి శ్రీకాంత్, నాయకులు డాక్టర్ సీహెచ్ రాజు, శ్రీరాం వీరయ్య, నరహరి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్కందగిరి ఆలయ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సుబ్రమణ్యం

## నేడు శంకరాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి ఆరాధానోత్సవాలు

బన్సీలాల్‌పేట్, జనవరి 7 : పద్మారావునగర్‌లోని స్కందగిరి సుబ్రమణ్యస్వామి దేవాలయంలో సోమవారం కంచి కామకోటి 68వ పీఠాధిపతి, శంకరాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి పరమాచార్య స్వామివారి 30వ ఆరాధానోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రమణ్యం తెలిపారు. ఈ మేరకు ఆదివారం పద్మారావునగర్‌లోని ఆలయంలో మేనేజింగ్ ట్రస్టీ కృష్ణన్ రాజమణి, కార్య నిర్వాహణాధికారి చల్ల విశ్వనాథ శాస్త్రితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి డీ.శ్రీధర్ బాబు, కేరళకు చెందిన ఎడ్వీర్ మఠాధిపతి హాజరవుతారని ఆయన తెలిపారు.

వారాసిగూడలోని గంగపుత్ర సంఘం 2024 క్యాలెండర్‌ను ఆదివారం రాత్రి నామాలగుండులోని వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో ఆ సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎల్లయ్య,ఎర్రబోయిన మల్లేశ్,నగరపు శ్యాం,ముఠా గణేశ్, వెంపటి మనోజ్,కట్కూరి అశోక్,పంపరి యాదగిరి, కొమురయ్య పాల్గొన్నారు. - సికింద్రాబాద్,జనవరి7

## బన్సీలాల్‌పేట్‌లో.. గ్యార్వీ

బన్సీలాల్‌పేట్, జనవరి 7 : బన్సీలాల్‌పేట్‌లోని మెట్లబావి సమీపంలో ఉన్న చిల్లా వద్ద ఆదివారం గ్యార్వీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల అనంతరం నిర్వాహకులు అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ నాయకుడు కే.లక్ష్మీపతిని సన్మానించారు. నాయకులు ఏసూరి శ్రీనివాస్, మురళి, రాజు, వెంకటేశ్, మహేశ్, నర్సింహ, భగవాన్ పాల్గొన్నారు.

గ్యార్వీ ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, నిర్వాహకులు

ఓల్డ్ వాసవీనగర్‌లో అక్షింతల కలశంతో సామాజిక వేత్త, బీఆర్ఎస్ నాయకుడు తేలుకుంట సతీశ్ గుప్తా

# ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

సికింద్రాబాద్/ మారేడ్‌పల్లి, జనవరి7: సికింద్రాబాద్‌లోని ఆలయాల్లో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి, మేకల సారంగపాణి,నాయకుడు భాస్కర్ గిరి ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలోనాయకులు రాజ్, అనిల్, వెంకటేష్, అజయ్, అక్షిత్, రోహిత్ పాల్గొన్నారు.

**మేడిబావిలో..**

మేడిబావి బస్తీలో నివసిస్తున్న ప్రజలకు శ్రీరాముడి అక్షింతలను బీజేపీ నాయకులు కనకట్ల అరవింద్‌హరి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాము, ప్రసాద్, కల్యాణ్, రాజీవ్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ ఐదో వార్డు వాసవీనగర్‌లో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఆదివారం కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే. రామకృష్ణ శోభాయాత్ర నిర్వహిస్తూ ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీనగర్ కాలనీ వాసులు, హిందూ సంఘాల నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**ఓల్డ్ వాసవీగర్‌లో..**

ఐదో వార్డులోని ఓల్డ్ వాసవీనగర్‌లో ఇంటింటికీ అయోధ్య శ్రీ రాముడి అక్షింతలను ప్రముఖ సామాజిక కార్యకర్త, బీఆర్ఎస్ నాయకులు తేలుకుంట సతీష్ గుప్తా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు మణిగండ్ల శ్రీనివాస్, కాకాగూడ బాలకృష్ణ, బొజ్జ అజయ్, గంప సాయి ప్రసాద్, రాకేశ్, సునీల్ పాల్గొన్నారు.

నామాలగుండు పరిధిలో అక్షింతలు పంపిణీ చేస్తున్న సారంగపాణి, భాస్కర్‌గిరి


మేడిబావి బస్తీలో అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వాసవీనగర్‌లో అక్షింతలను పంపిణీ చేస్తున్న బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

## 'మోటర్లకు మీటర్లు వద్దు'

జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి రవీందర్

మారేడ్‌పల్లి, జనవరి 7: కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రజలు వినియోగిస్తున్న భూగర్భ జలాల బోరు మోటర్లకు కంటోన్మెంట్ బోర్డు మీటర్లు బిగించి డబ్బులు వసూలు చేయడంపై వికాస్‌మంచ్ మండిపడింది. ఆదివారం జూమ్ మీటింగ్ ద్వారా అభిప్రాయ సేకరణ నిర్వహించినట్లు కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్ తెలిపారు. జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న వ్యక్తులందరూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు...బోరు మోటర్లకు మీటర్లు పెట్టాలన్న ప్రతిపాదనను ముక్త కంఠంతో ఖండిస్తూ తీర్మానం చేసినట్లు వెల్లడించారు. ఈ జూమ్ మీటింగ్‌లో వికాస్ మంచ్ ప్రతినిధులు ఎలుగంటి ప్రభు గుప్తా, ఇటుక గోపి, ఫసి, అశోక్ కుమార్, అరుణ్ యాదవ్, నర్సింగ్‌రావు, చైతన్య పాల్గొన్నారు.

## సమాజంలో సాహితీవేత్తల పాత్ర గొప్పది

రవీంద్రభారతి, జనవరి 7: సమాజ మార్పు తీసుకురావడంలో సాహితీవేత్తల పాత్ర చాలా గొప్పదని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. ఆది వారం గోల్కొండ సాహితీ కళాసమితి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక, తెలంగాణ భాష చైతన్య సమితి, లక్షసాధన ఫౌండేషన్ సం యుక్త ఆధ్వర్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సాహిత్య, సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో సన్మాన సభ రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సాహిత్య, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు స్పీకర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షుడు డా. చంద్రప్రకాశ్‌రెడ్డి, తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్, బీపీ నర్సింహులుగుప్తా, డా.భుజంగరెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

## జ్ఞాపికలు.. సర్టిఫికెట్లు ప్రదానం

మారేడ్‌పల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఒకినావా స్పోర్ట్స్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే చాంపియన్ షిప్ –2024 కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే. రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై కరాటే పోటీలను తిలకించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. - మారేడ్‌పల్లి, జనవరి 7

## టీచర్లు జ్ఞానానికి ప్రతినిధులుగా ఉండాలి

చిక్కడపల్లి, జనవరి 7: జ్ఞానానికి ప్రతినిధులుగా ఉపాధ్యాయులు ఉండాలని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) ప్రతినిధి ఆశన్న అధ్యక్షతన ఆవిర్భావ సభను నిర్వహించారు. సమావేశంలో ప్రొఫెసర్లు తిరుమలి, మురళీమనోహర్, డాక్టర్ విశారదమహారాజ్, రామయ్య యాదవ్, ధర్మ ప్రతినిధిలు సౌద అరుణ, లింగయ్యయాదవ్, దామెర ఉపేందర్, నాగరాణి, ఎన్. రమేశ్, పి.అశోక్ పాల్గొన్నారు.

## రోడ్డు పనులు పరిశీలన

చిక్కడపల్లి, జనవరి7: రాంనగర్ డివిజన్ దయార్ మార్కెట్‌లో ఆదివారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ రోడ్డు పనులు పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

బహుమతులు అందుకున్న మహిళలతో విశ్వకర్మ సంఘం సభ్యులు

బేగంపేట్ జనవరి 7: సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రంగవల్లి కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. సోమసుందరం వీధిలోని విశ్వకర్మ భవనంలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 50 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ ముగ్గుల పోటీలో మొదటి బహుమతి సంధ్యాకుమారికి రూ. 5 వేలు, రెండో బహుమతి సంధ్యాదేవికి రూ.3 వేలు , మూడో బహుమతి షణ్ముఖప్రియ రూ.2వేలు చొప్పున గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు గోపాలపురం ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి గిర్మాపురం భాస్కర్‌లు పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు బోనాల శ్రీనివాస్, బి వీరాచారి, వీరాంజనేయులు, శివకుమార్, సంఘం మాజీ అధ్యక్షుడు దుబ్బాక కిషన్‌రావు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలోని ఓసీమమ్ పాఠశాలలో ఆదివారం 11వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ నటుడు వక్త ఏవీ. ప్రదీప్, పాఠశాల చైర్మన్ ఎండీ.సీఎం ప్రకాశ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.
- కంటోన్మెంట్,జనవరి 7

తిరుమలగిరి బంజారా కాలనీలో ఆదివారం ఉమెన్ మేళా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ముఖ్యఅతిథిగా బోర్డు మాజీ సభ్యురాలు భాగ్యశ్రీ హాజరై జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమెను స్థానిక మహిళలు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అస్లాం ఖాన్,ప్రధాన కార్యదర్శి వై.వి.రావు,నిర్వాహకులు యశోద,రీతు, ప్రతిభ, రచన పాల్గొన్నారు. - బొల్లారం, జనవరి 7

## నిరాశ్రయులకు అండగా 'స్కై ఫౌండేషన్'

ప్రథమ చికిత్స చేస్తున్న స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ సంజీవ్‌కుమార్

బన్సీలాల్‌పేట్, జనవరి 7 : పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోడ్ల పక్కన ఉంటున్న వృద్ధులు, అభాగ్యులు, దిక్కులేని వారితో పాటు దివ్యాంగులను ఆప్యాయంగా పలకరించి దుస్తులు, బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. ఆదివారం సభ్యులతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో వ్యానులో తిరుగుతూ దుస్తులు, బిస్కెట్లు, తాగునీటి ప్యాకెట్లు, అనారోగ్యంతో ఉన్నవారికి కట్టుకట్టి ప్రథమ చికిత్స చేసి మందులు అందజేశామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు. ప్రతి నెల రెండు, నాలుగో ఆదివారాల్లో అన్నదానం చేస్తున్నామని అన్నారు.

## నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

మారేడ్‌పల్లి, జనవరి 7:ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్, జాయింట్ ఫోరం ఫర్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ పిలుపు మేరకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ...పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8 నుంచి 11 వరకు డివిజన్‌లోని అన్ని బ్రాంచీల ప్రధాన కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ పిల్లల మర్రి రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ శంకర్‌రావు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ఉంటాయన్నారు. ఈ పోరాటంలో భా గస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చిక్కడపల్లి, జనవరి 7: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని కాంగ్రెస్ నాయకురాలు గుర్రం చంద్రకళ శంకర్ అన్నారు. గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం శంకర్, అభిషేక్ కెన్నెడీ, నర్సింగ్‌రావు, సురేశ్‌యాదవ్, గుండు జగదీశ్‌బాబు, సుబ్బారావు. గిరి, శ్రీనివాస్‌రెడ్డి, దినేశ్, సలాం, హఫీజ్ పాల్గొన్నారు.